

జిఒ 85 రద్దు కోరుతూ సమ్మె



నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన సిబ్బంది

జీలుగుమిల్లి : పీజీ వైద్య విద్యలో ఇన్‌సర్వీస్ కోటా కుదిస్తూ తీసుకొచ్చిన జిఒ 85కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సంఘం ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు మంగళవారం నల్లరిబ్బన్లతో విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి నుంచి సమ్మె ప్రారంభిస్తూ 16వ తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలను చేయనున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో వైద్యాధికారులు దివ్య, గాయత్రి, హేమలత, రాగబిందు, దిలీప్ సాయి చందు పాల్గొన్నారు.


కుక్కునూరు: సీతారామనగరం-వేలేరు రోడ్డుపైకి చేరిన వరద


వేలేరుపాడు మండలంలో పడవలపై పునరావాస కేంద్రాలకు..

గోదావరి ఉగ్రరూపం

ఆందోళనలో విలీన మండలాల ప్రజలు

50 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలింపు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్, కుక్కునూరు రూరల్

గోదావరికి మరోసారి వరద పోటెత్తుతోంది. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో మండలంలోని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కూనవరం వద్ద గోదావరిలో కలుస్తున్న శబరి నది కూడా ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో మండలంపై వరద ప్రభావం కన్పిస్తోంది. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్థానిక అధికారులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలైన తాట్కూరుగొమ్ము, రేపాకగొమ్ము తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని కోరారు. తిరుమలాపురం నిర్వాసితులను కన్నాయిగుట్ట పునరావాస కేంద్రానికి, తాట్కూరుగొమ్ము ప్రజలను భూదేవిపేటలోని కెజిబివి హాస్టల్‌కు, నాళ్లవరం ప్రజలను నాళ్లవరం కాలనీలోకి, రేపాకగొమ్ము ప్రజలను నెమలిపేట ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి, వేలేరుపాడు మార్కెట్లోని ప్రజలను శివకాశిపురంలోని ఆశ్రమం పాఠశాలలోని పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని ఆదేశించారు.


పోలవరం వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి

30 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

గోదావరి వరద పోటెత్తడంతో మండలంలో 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు నుంచి రుద్రంకోటకు వెళ్లే రహదారి, రేపాకగొమ్ము రహదారులపై నడుములోతు నీళ్ల ప్రవహిస్తుండటంతో రేపాకగొమ్ము ప్రజలు పునరావాస కేంద్రాలకు సైతం పడవలపై వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే మార్గంలో కన్నాయిగుట్టలోని జిల్లేడు చెరువు వద్ద వరద ప్రవాహం చేరడంతో కొత్తూరు, బోళ్లపల్లి, ఎడవల్లి కోయిదా, కట్కూరు తదితర 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

కుక్కునూరు రూరల్: గోదావరికి వరద పోటెత్తడంతో మండలంలోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. పది రోజులుగా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే ముంపులోనే ఉంది. మంగళవారం వరద ఉధృతికి మండలంలోని సీతారామనగరం-వేలేరు మధ్య ప్రధాన రహదారి, ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగుపై గల కాజ్‌వే నీట మునగడంతో 20 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఇప్పటికే గొమ్ముగూడేనికి చెందిన 130 కుటుంబాలు ముందుగానే పునరావాస కేంద్రానికి చేరుకోగా వరద పెరుగుతుండటంతో గ్రామంలోని 123 కుటుంబాలు రావికుంట పునరావాస కేంద్రానికి తరలొచ్చాయి. గోదావరికి గంటగంటకు అనూహ్యంగా వరద ఉధృతి పెరుగుతుండటంతో విలీన మండలాల ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది. మండలంలో మొక్కదశలో ఉన్న మిర్చి పంట వందల ఎకరాల్లో ముంపునకు గురైంది. గోదావరి వరద మరింత పెరిగితే మండలంలోని కౌండిన్యముక్తి, ఎల్లప్పగూడెం, బాపన్నగూడెం, లచ్చిగూడెం, కుక్కునూరు-ఎ బ్లాక్ వంటి గ్రామాలు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే వరద ఉధృతి పెరుగుతుండటంతో లోతట్టు గ్రామాల ప్రజలను అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు.

పోలవరం: గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 10,39,627 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32,850 మీటర్లు, స్పిల్‌వే దిగువన 24,350 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ప్రాజెక్టు ఇఇ మల్లికార్జునరావు తెలిపారు.

ముంచుతారు.. తరలిస్తారు..!


వేలేరుపాడు: సురక్షిత ప్రాంతాలకు తరలుతున్న జనం

గోదావరి వరదలతో కుక్కునూరు, వేలేరుపాడుల్లో నిర్వాసితుల పరిస్థితి దారుణం

రెండు నెలల వ్యవధిలో రెండుసార్లు ఊళ్లు వదలాల్సిన దుస్థితి

పునరావాస పరిహారం ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చోద్యం

'మేము చేసిన తప్పేంటి. ప్రతియేటా గోదావరి వరదలకు కట్టుబట్టలతో గ్రామాలను వదిలి వెళ్లాల్సిన దుస్థితి మాకెందుకు.. సర్వం కోల్పోయిన మాకు ఇంకెన్నాళ్లు ఈ శిక్ష. పూర్తిస్థాయి పరిహారం ఇచ్చి గ్రామాలను ఖాళీ చేయించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం న్యాయమా'.. అంటూ విలీన మండలాల్లోని పోలవరం నిర్వాసితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గోదావరికి మరోసారి వరద పోటెత్తడంతో గ్రామాల నుంచి ప్రజలను తరలిస్తున్న నేపథ్యంలో అక్కడి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ ఏడాదిలో రెండోసారి గ్రామాలను వదిలి వెళ్లాల్సి రావడంతో నిర్వాసితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద నీటిమట్టం 48 అడుగులు దాటేయడంతో రెండోప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 55 అడుగుల వరకూ గోదావరి వరద పెరగనున్నట్లు అంచనా. దీంతో కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెంకు చెందిన 250కుపైగా కుటుంబాలను రావికుంట పునరావాస కాలనీకు తరలించారు. జులై మొదటివారంలో వచ్చిన వరదలకు గొమ్ముగూడెం ప్రజలందరినీ పునరావాస కాలనీకి తరలించారు. మళ్లీ ఆగస్టు 20వ తేదీ తర్వాత వారంతా గ్రామాలకు చేరుకున్నారు. మళ్లీ రెండోసారి గ్రామాలను వదిలివెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వేలేరుపాడు మండలంలోని రాపాకగొమ్ము, తాట్కూరు గొమ్ముతోపాటు పలు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇక్కడి ప్రజలు జులై వరదకు పునరావాస కేంద్రాలకు వెళ్లి ఇటీవలే ఇళ్లకు చేరుకున్నారు. ఇప్పుడు మళ్లీ తట్టాబుట్టా సర్దుకుని వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో అక్కడి ప్రజలు పడుతున్న ఆవేదన అంతాఇంతా కాదు. ఏడాదిలో రెండు, మూడుసార్లు గ్రామాల నుంచి కట్టుబట్టలతో బయటికి వెళ్తూ నరకయాతన అనుభవిస్తున్నామని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఏదైనా ప్రాజెక్టు నిర్మించాలంటే ముందుగా నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం చెల్లించి ఆపై పనులు చేపట్టాలి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో మాత్రం అందుకు విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండానే కాపర్ డ్యాం నిర్మించేశారు. దీంతో చిన్నపాటి వరదకు సైతం గోదావరి నీరు వెనక్కుబిగదన్ని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని దాదాపు 30 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. వరద ఉధృతి పెరిగితే మిగిలిన గ్రామాల్లోకి వరదనీరు చేరుతోంది. ఈ రెండు మండలాల్లో 107 నివాసిత ప్రాంతాలు ఉండగా 20 వేలకుపైగా కుటుంబాలు ఉన్నాయి. 2022లో ఇళ్లపై నుంచి వరదనీరు పొంగిపొర్లడంతో అక్కడి ప్రజలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. ప్రతియేటా విరుచుకుపడుతున్న వరదలకు అక్కడి ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. భూములకు పరిహారం, పునరావాస ప్యాకేజీ, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం వంటివి పూర్తిస్థాయిలో ప్రభుత్వం అందించలేదు. పరిహారం ఇవ్వకుండా గ్రామాలను ఖాళీ చేస్తే ఇక నిర్వాసితులను పట్టించుకునే నాథుడే ఉండరని అందరికీ తెలిసిందే. దీంతో తమకు పూర్తిస్థాయిలో పరిహారం అందిస్తే గ్రామాలను ఖాళీ చేస్తామని నిర్వాసితులు నెత్తినోరు మొత్తుకుంటున్నారు. ప్రభుత్వం మాత్రం పరిహారం ఇవ్వడం లేదు. ప్రతియేటా గోదావరి వరదలకు ముంచడం, తరలించడం అనేది ప్రభుత్వానికి పరిపాటిగా మారిపోయింది. ఇక ఈ నరకం తాము భరించలేమని, తమకు పూర్తిస్థాయి పరిహారం ఇచ్చి తరలించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

ప్రతియేటా నరకం చూస్తున్నాం..

గుమ్మడి నరసయ్య, రాపాకగొమ్ము, వేలేరుపాడు మండలం

జులైలో వరదలకు రావికుంట పునరావాస కాలనీకి తరలివెళ్లాం. కొద్దిరోజుల క్రితమే వచ్చాం. మళ్లీ గోదావరికి వరద రావడంతో గ్రామాన్ని వదిలి వెళ్లిపోవాలని చెబుతున్నారు. అక్కడికి వెళ్తే సరిగా పట్టించుకోని పరిస్థితి ఉంటుంది. ప్రతియేటా ఈ నరకం భరించలేకపోతున్నాం. పూర్తిస్థాయిలో పరిహారం ఇచ్చి నిర్వాసితులను తరలించాలని కోరుతున్నాం.

ఈ ఏడాదిలో రెండోసారి గ్రామం వదలాల్సిన పరిస్థితి

వెంకటేష్, గొమ్ముగూడెం, కుక్కునూరు మండలం

ఈ ఏడాదిలో రెండోసారి గ్రామాన్ని ఖాళీ చేసి వచ్చాం. ప్రతియేటా ఈ పరిస్థితి చాలా భయంకరంగా ఉంటుంది. 45 కాంటూరు పరిధిలో భూములకు ఇవ్వాల్సిన పరిహారం, 18 ఏళ్లు నిండిన యువతకు, 2006లో సేకరించిన భూములకు ఇస్తామన్న పరిహారం పూర్తిస్థాయిలో ప్రభుత్వం అందించాలి. పరిహారం పూర్తిస్థాయిలో ఇస్తే గ్రామాలను వదిలివెళ్లడానికి ఎవరికీ ఇబ్బంది ఉండదు. అలాకాకుండా తరలించాలని చూడడం ఏమాత్రం న్యాయం కాదు.

వెనక్కి ఎగదన్నుతున్న కొల్లేరు వరద నీరు

ఆగడాలలంక ఛానల్ వెంబడి రోడ్లు జలమయం


నీటిని నియంత్రించే పనులను పర్యవేక్షిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి - భీమడోలు

కొల్లేరు సరస్సులోని వరద నీరు వెనక్కి ఎగదన్నడంతో ఆగడాలలంక ఛానల్ వెంబడి రోడ్లపైకి నీరు చేరింది. ఫలితంగా చెట్టున్నపాడు-మల్లవరం గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాలను భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతీదేవి మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఆ ప్రాంతంలో వరద నీరు రాకుండా చూసేందుకు గ్రావెల్ బస్తాలను అడ్డుగా వేసే పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో భీమడోలు పంచాయతీ విస్తరణాధికారి ఎ.సుందరి పాల్గొన్నారు. ఇదే క్రమంలో చెట్టున్నపాడులోని కాలనీలోకి వరద నీరు చేరిందని, దీన్ని క్రమబద్ధీకరించే పనులను చేపట్టినట్టు ఎంపిడిఒ తెలిపారు.

వరద ప్రమాదం ముగిసే వరకు

అధికారులు సమిష్టిగా పని చేయాలి

పునరావాస కేంద్రాల్లో ఆహారం పూర్తి నాణ్యతతో ఉండాలి


కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - కుక్కునూరు

గోదావరి నదికి వరద ముంపు పూర్తిగా తగ్గేవరకూ బాధితులను పునరావాస కేంద్రాల్లోనే ఉంచాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మండలంలోని దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో బాధితులను ఆమె మంగళవారం కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉధృతి ఎక్కువగా ఉందని, రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన దృష్ట్యా, ప్రజలందరూ వరద ముంపు పూర్తిగా ముగిసేవరకు పునారావాస కేంద్రాల్లో ఉండాలన్నారు. వరదల కారణంగా తాము సర్వస్వం కోల్పోయామని, తమకు నిత్యావసర సరుకులు అందించాలని, తమకు ఉపాధి హామీ పనులు కల్పించాలని బాధితులు కోరారు. వరద నీరు పూర్తిగా తగ్గేవరకు పునరావాస కేంద్రాల్లో భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తారని, అనంతరం మీ గ్రామాలకు తరలి వెళ్లే సమయంలో నిత్యావసర సరుకులు అందిస్తారని తెలిపారు. వరద నీరు పూర్తిగా తొలగించిన తరవాత ఉపాధి హామీ పనులు చేపట్టి స్థానికులకు ఉపాధి కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం వింజరం, ముత్యాలంపాడు గ్రామాల్లో వరద ముంపునకు గురైన ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.అద్దయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.బాబ్జి, తహశీల్దార్ చలపతి, రెవెన్యూ, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనేతర భూస్వాములపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం ఆధ్వర్యాన పొగాకు బోర్డు ఆక్షన్ సూపరింటెండెంట్‌కు వినతి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భూములు అమ్ముకుని ఇప్పటికీ బేరన్లు అక్రమంగా అనుభవిస్తున్న గిరిజనేతర భూస్వాములపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం నేతల బృందం పట్టణంలోని పొగాకు వేలం కేంద్రం వద్ద పొగాకు బోర్డు ఆక్షన్ సూపరింటెండెంట్ శ్రీహరికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నిరాశ్రయులైన నిర్వాసితులకు భూమికి భూమి ఇవ్వాలన్నారు. పునరావాసం కోసం సేకరించిన భూముల్లో ఉన్న బ్యారన్‌లను అమ్మిన వారే తిరిగి అక్రమ పద్ధతుల్లో లీజు చేస్తున్నారన్నారు. బుట్టాయగూడెం మండలం దొరమామిడి, కోయిదా పునరావాస కాలనీల సమీపంలో 20 బ్యారన్‌లను ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో గిరిజనేతరులు అమ్మేశారని గుర్తుచేశారు. ప్రభుత్వానికి అమ్మిన బ్యారన్‌లను గిరిజనేతర భూస్వాములు వినియోగిస్తున్నారన్నారు. దొరమామిడి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే 437, 446లలో 20 బ్యారన్లు అక్రమ పద్ధతిలో కొంత మంది దళారులు, గిరిజనేతరులు వినియోగిస్తున్నారు. ఆర్‌అండ్‌ఆర్‌లో కొనుగోలు చేసిన భూమిని కొంతమంది దళారులు పొగాకు బోర్డు రిజిస్ట్రేషన్ చేయించుకుని రిలీజ్‌లకు ఇస్తూ సొమ్ము తీసుకుంటున్నారని, వెంటనే పొగాకు బోర్డు ఆ రిజిస్ట్రేషన్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. పొగాకు బోర్డు ఆక్షన్ సూపరింటెండెంట్ శ్రీహరి మాట్లాడుతూ బ్యారన్‌లను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మొడియం నాగమణి, మండల నాయకులు పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్, బొడ్డు రాంబాబు పాల్గొన్నారు.

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కామయ్యపాలెం రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం మండల వ్యవసాయ శాఖాధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు వరి, వేరుశనగ పంటలకు నష్టం జరిగిందన్నారు. పంట భూములు ఇసుక మేటలు వేయడంతో తిరిగి పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇసుక మేటల తొలగింపునకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుంకవల్లి శేషగిరిరావు, తాళ్లూరి సూర్యారావు, యలమాటి నరసింహరావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్రం వైఖరి దుర్మార్గం

కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యాన రాస్తోరోకో



ఏలూరు అర్బన్ : పాత బస్టాండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న నాయకులు


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని నిరసిస్తూ కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శులు డిఎన్‌విడి ప్రసాద్, కె.బుచ్చిబాబు, బద్ద వెంకటరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. మూడేళ్లుగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయాలని మోడీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నం చేసిందని, అయితే రాష్ట్ర ప్రజానీకం మద్దతుతో కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారని తెలిపారు. ఫలితంగా ప్రభుత్వం వెనకడుగు వేసిందన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం పథకం ప్రకారం స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యంత నాణ్యమైన విశాఖ స్టీల్ ఉత్పత్తిని కావాలనే బిజెపి ప్రభుత్వం తగ్గించి నష్టాల్లోకి నెట్టి ప్రయివేటు వారికి అప్పజెప్పేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. నూతన ప్రభుత్వ ఏర్పడిన తర్వాత స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాస్‌వర్మ విశాఖ స్టీల్‌ప్లాంట్ దేశంలోనే అత్యుత్తమ స్టీల్ ప్లాంట్ అని కొనియాడారన్నారు. 45 రోజుల్లోనే స్టీల్ ప్లాంట్‌ను రక్షించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని, మోడీని ఒప్పించి స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపిస్తామని హామీ ఇచ్చారన్నారు. నేటికి రెండు నెలలు గడిచినా స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడపడానికి ఎటువంటి చర్యలూ తీసుకోకపోగా ప్లాంటును నాశనం చేసేందుకు అన్ని ప్రయత్నాలూ ముమ్మరం చేశారన్నారు. టిడిపి మద్దతుతో కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వాన్ని చంద్రబాబు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కనీసం ప్రశ్నించడం లేదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు బిజెపిపై ఒత్తిడి తెచ్చి స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘాల నాయకులు డేగ ప్రభాకర్, కే శ్రీనివాస్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బండి వెంకటేశ్వరరావు, కిసాన్ సెల్ నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ లక్ష మంది కార్మికులకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి చూపిస్తూ, మూడు లక్షల కోట్ల సంపద కలిగిన స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటు వారికి కట్టబెట్టాలని చూస్తే రాష్ట్రంలోని రైతులు, కార్మికులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసే ఆలోచన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఎఐటియుసి నాయకులు ఆర్.శ్రీనివాస్ డాంగే, ఎం.కృష్ణ చైతన్య, కె.కృష్ణమాచార్యులు, ఐఎఫ్‌టియు నాయకులు వై.శ్రీనివాసరావు, ఎం.అప్పారావు, పి.గంగరాజు, సిఐటియు నాయకులు బి.సోమయ్య, వివిఎన్.ప్రసాద్, జి.రవికిషోర్, కె.పోసమ్మ, వైఎస్.కనకారావు, కె.విజయలక్ష్మి నాయకత్వం వహించారు.

కామవరపుకోట : విశాఖ స్టీల్‌ను ప్రభుత్వ యాజమాన్యంలో నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం కామవరపుకోటలో జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు ప్రధాన రహదారిపై సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి టివిఎస్.రాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఎఐటియుసి ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కోటిగంటి సోమరాజు, ఎన్న భీమయ్య, ఆర్.బాలరాజు, దుర్గాప్రసాద్, గోవిందరాజు, వెంకన్న, శేషం రాజు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని కోరుతూ నూజివీడు చిన్న గాంధీబొమ్మ సెంటర్లో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని దానికి అవసరమైన వనరులు, గనులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చాలన్నారు. అలాగే ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులను ఇబ్బంది చేసేందుకే గతంలో నల్ల చట్టాన్ని తీసుకొచ్చి వ్యవసాయని దెబ్బతీసే ప్రయత్నం చేసిందన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్నార్ హనుమాన్లు, సిఐటియు నాయకులు జయలక్ష్మి, రజిని, నాగూర్, సంసోన్ రవి, మరియ దాసు, శోభనాద్రి నాయుడు, అరుణ్ నాని, ఎఐటియుసి కార్యదర్శి పుల్లారావు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో వంతెన నిర్మాణానికి కృషి : మంత్రి


రహదారికి పడిన గండిని పరిశీలిస్తున్న మంత్రి

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు నుంచి చెక్కపల్లి వెళ్లే మార్గంలో కొట్టుకుపోయిన వంతెన స్థానంలో ప్రస్తుతానికి తాత్కాలిక వంతెన ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామనని మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. తర్వాత శాశ్వత వంతెన నిర్మాణం చేపడతామన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. మొదట ముసునూరు గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలు సమస్యలు ఆయన దృష్టికి రాగా అందుకు సంబంధించి అధికారులతో మాట్లాడారు. అధికంగా వర్షం వచ్చినప్పుడు భోజనశాలలో వర్షపు నీరు పడుతుందని తెలపడంతో అధికారులతో మాట్లాడి భోజనశాలకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. చింతలవల్లి శివారు గోగులంపాడులో డ్రెయినేజీ వ్యవస్థ బాగోలేదని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందించి తన సొంత నిధులతో పొక్లెయిన్ పంపిస్తానని, డ్రెయినేజీ పూడిక తీయించుకోవాలని చెప్పారు. తమకు నష్టపరిహారం అందించాలని వర్షాల వల్ల మినుము, వరి, పత్తి, అరటి తదితర పంటలు నష్టపోయిన రైతులు కోరారు. భారీ వర్షాలకు గండి పడిన చింతలవల్లి నుంచి చెక్కపల్లి వెళ్లే ప్రధాన రహదారిని పరిశీలించారు. డిఇతో మాట్లాడుతూ ప్రస్తుతానికి తాత్కాలిక రహదారి ఏర్పాటు చేసి, శాశ్వత వంతెన నిర్మాణానికి రూ.50 లక్షల నిధులతో వంతెన నిర్మాణం చేపట్టాలన్నారు. ముసునూరు నుంచి వలసపల్లి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బి రహదారికి గండి పడటంతో పరిశీలించి రూ.ఐదు లక్షల నిధులతో వంతెన నిర్మాణం చేపట్టాలన్నారు. ముసునూరు గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని సర్పంచి కొండేటి విజయలక్ష్మి బాబి, ఉప సర్పంచి తోట శ్రీనివాసరావు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి డ్రెయినేజీ పూడిక తీత పనులు వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు. చెక్కపల్లి గ్రామంలోని పెద్ద చెరువును పరిశీలించి గండి పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రైతుసంఘం నుంచి నిమ్మగడ్డ నర్సింహా బహిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉంటూ సంఘాన్ని విచ్ఛిన్నం చేసే చర్యలకు పాల్పడిన నిమ్మగడ్డ నర్సింహాను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు జిల్లా కమిటీ సమావేశం ప్రకటించింది. ఏలూరు అన్నే భవనంలో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా నిమ్మగడ్డ నర్సింహా రైతు సంఘం కార్యక్రమాలకు దూరంగా ఉంటూ సంఘం విచ్ఛిన్న చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇక నుంచి ఆయన చర్యలకు, రైతు సంఘానికి ఎటు వంటి సంబంధం ఉండదని ప్రకటించారు. ఆయనను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు జిల్లా కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు.

కొల్లేరు ముంపు బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

ముంపు బారిన పడిన కుటుంబాలను వెంటనే ఆదుకునే విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ స్పష్టం చేశారు. వరద నీటిలో చిక్కుకుపోయి వారం రోజులుగా ముంపులో కొట్టుమిట్టాడుతున్న కొల్లేరులంక గ్రామాల్లో ఆయన అధికారులతో కలిసి నాటుపడవపై వెళ్లి పరిశీలించారు. బాధితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నడూ కని విని ఎరగని విధంగా కొల్లేరుకు వరద నీరు తాకిందన్నారు. దీంతో కొల్లేరు పరివాహక ప్రాంతాలను వరద నీరు ముంచెత్తిందని, గ్రామాలకు గ్రామాలే వరద నీటిలో చిక్కుపోయాయని, కనీసం రహదారి మార్గం కూడా లేదన్నారు. గ్రామంలోనే పడవలపై ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే ముంపు గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను పూర్తిస్థాయిలో పర్యవేక్షించి బాధితులను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఆయన నందిగామలంకలో పర్యటించారు. .

పారిశుధ్య పనులు సక్రమంగా జరగాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల వ్యాప్తంగా పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేటట్లు చూడాలని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ కమిషనరేట్ ప్రత్యేకాధికారి వెంకట ప్రసాద్‌తో కలిసి గ్రామ పంచాయతీ పరిధిలోని డ్రెయినేజీలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పంచాయతీల్లో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక గ్రామస్తులతో మాట్లాడి గ్రామ పంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా, పంచాయతీ ద్వారా సేవలు సకాలంలో అందుతున్నాయా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిర్రి జగదాంబ, కార్యదర్శి అశోక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రామ, వార్డు సచివాలయాల వాలంటీర్లకు రావాల్సిన మూడు నెలల బకాయి జీతాలు వెంటనే ఇవ్వాలని ఏలూరు నగర వార్డు వాలంటీర్ల సమావేశం డిమాండ్ చేసింది. ఏలూరు నగర వార్డు వాలంటీర్ల సమావేశం మంగళవారం పవర్‌పేటలోని సిఐటియు కార్యాలయంలో కుశాల్, మూర్తిల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ ఎన్నికలకు ముందు టిడిపి ప్రభుత్వం వార్డు వాలంటీర్ల వేతనాలను రూ.పది వేలకు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వార్డు వాలంటీర్లకు ఇవ్వాల్సిన మూడు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని బి.సోమయ్య డిమాండ్ చేశారు. లేకపోతే ఈ సమస్యపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని తెలిపారు. వార్డు వాలంటీర్ల బకాయి వేతనాల కోసం ఈ నెల 17వ తేదీ కలెక్టరేట్‌కు సామూహిక రాయబారాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆత్మహత్యల నిరోధక దినోత్సవం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఆత్మహత్యల నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లా మెడికల్ హెల్త్ విభాగం, డిఎస్‌డబ్ల్యు విభాగం, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ శర్మిష్ట మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తమకు తెలిసిన వారు ఎవరైనా శారీరక, మానసిక, ఆర్థిక పరమైన ఇబ్బందుల్లో ఉంటే వారికి తోడుగా ఉండాలన్నారు.

జిల్లా స్థాయిలో హీల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో మండల పరిధిలోని తోటపల్లి హీల్ స్కూల్ విద్యార్థులు పతకాల పంటను పండించారు. ఏలూరు అగ్రహారంలోని సీతారామ భారతీయ కళ్యాణ మండపంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన యోగాసన పోటీల్లో హీల్ విద్యార్థులు ఎనిమిది బంగారు పతకాలు, మూడు రజిత, మూడు కాంస్య పతకాలను సాధించినట్లు ప్రిన్సిపల్ బి.సాయిబాబు తెలిపారు. హీల్ స్కూల్ నుంచి 11 మంది బాలికలు, ఐదుగురు బాలురు ఈ పోటీల్లో పాల్గొనగా 11 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సిఇఒ కూరపాటి అజయ్ కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ల డైరెక్టర్లు పి.నాగరాజు, సిహెచ్.ప్రభుదాసులు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ పిఒ మాధవిలత అన్నారు. చింతలపూడి సెక్టార్‌లోని సుప్రింపేట అంగన్వాడీ కేంద్రం వద్ద మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు, ఆరోగ్యకరమైన ఆహార జీవన విధానాలపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు.

భీమడోలు :అంగన్వాడీ కేంద్రాల లబ్ధిదారులు పోషకాహార ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ సిడిపిఒ కెవి.విజయలక్ష్మి కోరారు. భీమడోలు మండల పరిషత్ సమా వేశ మందిరంలో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు మం డలాల పరిధిలోని ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పోషకాహార మాసోత్సవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిడిపిఒ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథు లుగా భీమడోలు జెడ్‌పిటిసి తుమ్మగుంట భవాని రంగ, మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజ నేయులు, అతిథిగా భీమడోలు ఎంపిడిఒ పద్మావతిదేవి హాజరయ్యారు. సామూహిక సీమంతం కార్యక్రమం చేపట్టారు.

నేరాలు - ఘోరాలు

పామాయిల్ గెలలు అక్రమ తరలింపు

ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి - టి.నరసాపురం

అల్లంచర్ల అటవీ భూమిల్లో పామాయిల్ గెలలు నరికి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చింతపూడి అటవీ అధికారి సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అల్లంచర్ల కొత్తగూడెం అటవీ భూమిలో అదే గ్రామానికి చెందిన మన్నెంపల్లి సురేష్ గత 20 ఏళ్ల క్రితం అటవీకి ఆనుకుని ఉన్న తన పొలంలో పామాయిల్ సాగు చేపట్టాడు. ఈ క్రమంలో తోట పక్కనే ఉన్న అటవీ భూమిని కొంత ఆక్రమించి పామాయిల్ మొక్కలు వేసుకుని సాగు చేస్తున్నాడు. ఆక్రమణ భూమిలో పామాయిల్ గెలలు విక్రయిస్తుండగా అటవీ అధికారులు గతంలో ఒకసారి ట్రాక్టర్ సీజ్ చేసి సురేష్‌ను హెచ్చరించారు. కానీ సురేష్ గెలలు నరికి మరోసారి తరలిస్తుడంటంతో సమాచారం అందుకున్న అటవీ అధికారులు దాడి చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కొయ్యలగూడెం : మండలంలోని కన్నాపురంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలవరం సిఐ బాలసురేష్‌బాబు ఆధ్వర్యంలో కొయ్యలగూడెం ఎస్ఐ చంద్రశేఖర్ మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.61,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

భవనం ప్రారంభించారు.. సేవలు మరిచారు..!

చిన్న అద్దె షాపులోనే హెల్త్, వెల్‌నెస్ సెంటర్
నిరుపయోగంగా వైద్య పరికరాలు
అధికారులు స్పందించాలని ప్రజల వేడుకోలు



ప్రారంభించిన నూతన భవనం ఇదే..

ప్రజాశక్తి - కామవరపుకోట

రూ.లక్షలు ఖర్చు పెట్టి నిర్మించిన ప్రభుత్వ భవనం ఉండగా చిన్న అద్దె షాపులో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను నడుపుతున్నారు. మండలంలోని తడికలపూడిలోని సచివాలయం-2 పరిధిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను అతి చిన్న షాపులో వైద్య సేవలు నిర్వహిస్తున్నారు. ఈ సచివాలయం పరిధిలో సుమారు మూడు వేల మంది వరకు జనాభా ఉన్నారు. వీరిలో అత్యధికులు ఎస్‌సి జనాభా ఉన్నారు. ఈ విలేజ్ క్లినిక్ సెంటర్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఎఎన్ఎం, ఇద్దరు ఆశావర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన పక్కా భవనాన్ని ఫిబ్రవరి నెలలో ప్రారంభించారు. ప్రారంభించి ఇప్పటికీ సుమారు ఏడు నెలలవుతున్నా నేటికీ ఈ వెల్‌నెస్ సెంటర్ కార్యక్రమాలు చిన్న షాపులోనే నిర్వహిస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ప్రభుత్వ భవనం ఉన్నా సరే చిన్న అద్దె షాపులో హెల్త్, వెల్‌నెస్ సెంటర్ నడపడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


అద్దెకు నిర్వహిస్తున్న చిన్నషాపు

ముగ్గురు రోగులు ఒకేసారి క్లినిక్‌కి వెళ్తే సరిపోనంత చిన్న షాపులో వైద్య సేవలు నిర్వహిస్తున్నారని, దీని గురించి పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు వాపోతున్నారు. చిన్న అద్దె షాపులో నడుస్తున్న ఈ సెంటర్ చాలా చిన్నది కావడంతో క్లినిక్‌కి సంబంధించిన వస్తువులు, వైద్య పరికరాలన్నీ కూడా ఒక గదిలో పెట్టి ఉంచారు. దీని వల్ల ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన వైద్య పరికరాలు వాడుకునే అవకాశం ఉండటం లేదని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఈ క్లినిక్ పక్కనే నిర్మించిన రైతు సేవ కేంద్రం నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నా ప్రజలకు ఎంతో అవసరమైన హెల్త్, వెల్‌నెస్ సెంటర్ ఎందుకు తెరుచుకోవడం లేదో, ఈ భవనం నుంచి వైద్య సేవలు ఎందుకు అందించడం లేదో తమకు అర్థం కావడం లేదని పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క నీటి సదుపాయం లేని కారణంగా ఈ భవనం నుంచి వైద్య సేవలు జరగడం లేదని పలువురు స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకుని వెంటనే కొత్త భవనంలోకి హెల్త్, వెల్‌నెస్ సెంటర్‌ను మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ రూ.25 లక్షల చెక్కు అందించారు. సిఎం చంద్రబాబును ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం సిఎం చంద్రబాబుకు ఎంపీ మహేష్ కుమార్ రూ.25 లక్షల చెక్కు అందించారు.

చింతలపూడి :విజయవాడ వరద బాధితుల సహాయార్థం సిపిఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలో రూ.25,800 విరాళాలుగా సేకరించామని సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య తెలిపారు. ఈ సేకరించిన మొత్తాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవకృష్ణచైతన్యకు సిపిఐ కార్యాలయంలో మంగళవారం అందించినట్లు గురవయ్య తెలిపారు.

భీమడోలు :పొలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన, షేక్ హసేన దంపతులు సిఎం సహాయ నిధికి రూ.పది వేల సాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఎంఎల్‌ఎ ధర్మరాజుకు ఆయన క్యాంపు కార్యాలయంలో రూ.పది వేల చెక్కును అందించారు.

టి.నరసాపురం :టి.నరసాపురం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి రేఖాంబిక రూ.ఏడు వేల విరాళాలు సేకరించి పాఠశాల యాజమాన్యానికి అందించారు. టి.నరసాపురానికి చెందిన మండం ఆదిత్య కుమార్, పుష్పమాధవి దంపతుల కుమార్తె రేఖాంబిక విరాళాలు సేకరించి తాను కొంత నగదు చేర్చి మొత్తం రూ.ఏడు వేలను తాను పదోతరగతి చదువుతున్న చింతలపూడి భాష్యం స్కూల్ యాజమాన్యానికి అందించారు. బాధితులకు సాయం అందించడం పట్ల పాఠశాల యాజమాన్యం ఆమెను అభినందించారని విద్యార్థి తండ్రి ఆదిత్య తెలిపారు. ప్రతిఒక్కరూ స్పందించి విజయవాడ బాధితులకు సాయం అందించేందుకు ముందుకు రావాలని కోరారు.

దెందులూరు: ఏలూరు పట్టణం 40వ డివిజన్ ఏటిగట్టు గణపతి ఫ్రెండ్ సర్కిల్ యువకుల ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు అందించారు. యువకులు విరాళాలు సేకరించి ఆహారం వండించి ప్యాకింగ్ చేశారు.

కలిదిండి : కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93లో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు తమ వంతు సాయంగా సుమారు రెండు వేల మందికి సరిపడా బట్టలు, వాటర్ బాటిల్స్, నిత్యావసర సరుకులను తరలించినట్లు తెలిపారు. పాము రవి కుమార్, మోటుపల్లి సోమేశ్వరరావు, పచ్చిగొళ్ల లలితా ప్రసాద్, జి.రాంబాబు, ఎ.లక్ష్మి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మండలంలోని సున్నంపూడి, పడమటిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరద బాధితుల పునరావాస కేంద్రాలను కైకలూరు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్ పరిశీలించారు. వరదల వల్ల ఇబ్బందులకు గురైన బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

రేషన్ పంపిణీ

ప్రజాశక్తి - దెందులూరు

కొల్లేరు వరద ప్రభావిత గ్రామాల్లో నూరుశాతం రేషన్ పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు అవసరమైన ఏర్పాట్లను చేసినట్లు ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ తెలిపారు. మంగళవారం కోటేశ్వర దుర్గాపురం, గురుకులపేట, తిమ్మారావుగూడెం, కలకుర్రు గ్రామాల్లో రేషన్ పంపిణీ తీరును ఆయన పరిశీలించారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - దెందులూరు

భారీ వర్షాలకు, కొల్లేరు వరద వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఏలూరు రూరల్ మండలంలోని జాలిపూడిలో కొల్లేరు వరద ముంపునకు గురైన వరి పంట పొలాలను రైతు సంఘం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పంట నష్టాలను వెంటనే నమోదు చేసి నష్టపరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నష్టపరిహారం అందించాలి

ప్రజాశక్తి - పోలవరం

వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపిపి సుంకర వెంకటరెడ్డి కోరారు. పోలవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి వర్షాలకు ముంపునకు గురైన రైతుల పంటల ఎమ్యూనరేషన్, తదితర అంశాలపై వ్యవసాయాధికారి కె.రాంబాబును వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై, పారిశుధ్యంపై చర్చించారు.

మురుగు కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి - పోలవరం

కొత్త పట్టిసీమ పంచాయతీ పరిధిలో పలు ప్రాంతాల్లో చేపట్టిన మురుగుకాలువ బోదుల పనులు, పూడికతీత పనులను మంగళవారం పంచాయతీ సర్పంచి మైగాపుల విజయదుర్గ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచి మైగాపుల విజయదుర్గ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా గ్రామాల్లో ఎప్పటికప్పుడుపారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

పారిశుధ్య కార్మికులకు సరైన సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విజయవాడలోని బుడమేరు వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో భాగంగా ఏలూరు నుంచి పారిశుధ్య పనుల నిర్వహణ నిమిత్తం తీసుకెళ్లిన 450 మంది పారిశుధ్య కార్మికులకు సరైన సౌకర్యాలు, భోజన వసతులు లేవని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ తెలిపింది. ఈ మేరకు యూనియన్ గౌరవ అధ్యక్షులు డి.సోమయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మికులు గత వారం రోజులుగా నీళ్లలో నాను తూ పనులు చేస్తున్నారని, వారికి ఎలాంటి గంబూట్లు, గ్లవ్స్, మాస్కులు లేవని, కాళ్లు, చేతులు నీళ్లల్లో నానిపోయి పాచిపోతున్నాయని, కనీసం కొబ్బరినూనె కూడా ఏర్పాటు చేయలేదని వారు తెలిపారు. బస చేసే నివాస ప్రాంతాల వద్ద కనీసం సరైన టాయిలెట్ల సౌకర్యం లేదని, టిఫిన్, భోజనం సకాలంలో అందించడంలేదని, కార్మికులు వారం రోజులుగా తాము తెచ్చుకున్న డబ్బులతో బయట తినాల్సి వస్తుం౦ని, ఆ డబ్బులు కూడా అయిపో యాయని వారు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం బుడమేరు వరద ముంపు ప్రాంతాల ప్రజ లకు సహాయక చర్యలు చేపడుతున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు తగిన వసతి, భోజన సదుపా యాలు ఏర్పాటు చేయాలని, లేకపోతే వారిని వెంటనే ఆయా మున్సిపాలిటీలకు తిరిగి రప్పించాలన్నారు. ఈ మేరకు ఈ నెల 11వ తేదీన రాష్ట్రంలోని మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని వారు తెలిపారు.

పాఠశాలలో హ్యాండ్‌వాష్ డే

చాట్రాయి :తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో మంగళవారం హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు తరువాత చేతులు శుభ్రపరచుకోవాలని తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలుచోట్ల 150 ఎకరాల్లో అక్కడక్కడ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్ తెలిపారు. మంగళవారం దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలవ్యాప్తంగా 120 ఎకరాల్లో వేరు శెనగ, 25 ఎకరాల్లో వరి, ఐదు ఎకరాల్లో పత్తి పంటలు దెబ్బతిన్నట్లు ఆయన తెలిపారు. ఈ పంటల నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి నాటిన రైతులు నారుమడుల్లో నీటిని బయటకు తీసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గుండెపోటుతో సీనియర్ పాస్టర్ లాజర్ మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి


లాజర్ (ఫైల్)

ముదినేపల్లి అంబేద్కర్ నగర్‌కు చెందిన క్రీస్తు సంఘం సీనియర్ పాస్టర్ యడ్ల లాజర్(70) మంగళవారం ఉదయం గుండెపోటుతో ముదినేపల్లిలోని స్వగృహంలో మృతి చెందారు. యడ్ల లాజరు గత 50 ఏళ్లుగా మండలంలోని పెదపాలపర్రు, పెదగొన్నూరు, వడాలి, ముదినేపల్లి, రావిగుంట తదితర గ్రామాల్లో సేవ చేశారు. ఇంటి వద్ద ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఆకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో కుప్పకూలిపోయి మరణించారు. పాస్టర్ లాజర్‌కు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య ఏడేళ్ల క్రితం మరణించారు. లాజర్ మృతదేహాన్ని ముదినేపల్లి మండల పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు సందర్శించి అంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. లాజర్ అంత్యక్రియలు బుధవారం ఉదయం ముదినేపల్లిలో జరపనున్నట్లు కుమారుడు ఇస్మాయేల్ తెలిపారు.

కొల్లేరులో ఆక్రమణలు.. ప్రజలకు శాపాలు..!

ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరు అభయారణ్యంలో ఆక్రమణలు ప్రజల పాలిట శాపంగా మారాయి. రాజకీయ నాయకుల స్వార్థం అధికారుల ధనదాహం ప్రకృతి విపత్తులకు దారి తీస్తుందనే విమర్శలు ఉన్నాయి. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు ఉన్నప్పటికీ కొల్లేరులో యధేచ్ఛగా సాగుతున్న అక్రమ చెరువుల నిర్మాణాలు అధికారుల విధులను తేటతెల్లం చేస్తున్నాయి. అడ్డుకోవాల్సిన అధికారుల్లో పేట్రేగిన అక్రమార్జనతో ఆక్రమణలు పెరిగిపోయి కొల్లేరు ముంపునకు గురై ప్రజలు కష్టాలు అనుభవించాల్సి వస్తుంది. పర్యావరణాన్ని పరిరక్షించాలని గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదు. కొల్లేరును పరిరక్షించాల్సిన అధికారుల్లో నెలకొన్న అధిక సంపాదన కోరిక ప్రశాంతతకు నిలవమైన కొల్లేరు గ్రామాలను జల దిగ్బంధనంలోకి నెట్టేసింది. వేలాది ప్రజల మనుగడను జీవనాన్ని దెబ్బ తీయడంతో పాటు ఆపన్నల హస్తం కోసం ఎదురుచూస్తూ అలమాటించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే కొనసాగితే మరోసారి కొల్లేరు ఆపరేషన్ చేపట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. దీనికి నిదర్శనమే గత ప్రభుత్వ హయాములో కొల్లేరులో విచ్చలవిడిగా చేపట్టిన అక్రమ చెరువులు నిర్మాణాలు.

జాతీయ సంపదగా గర్వంగా చెప్పుకునే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మహా మంచినీటి సరస్సు కొల్లేరు. ప్రకృతి అందాలకు వివిధ రకాల పక్షులకు, అపార మత్స్య సంపదకు, వలస పక్షులకు, పర్యావరణ ప్రేమికులకు స్వర్గధామం. ఇదిలా ఉంటే ఎగువ ప్రాంతాల్లోని వరద నీరు బుడమేరు, చంద్రయ్య, మోటూరు, నేహరాలి, రామిలేరు, తమ్మిలేరు, ఎర్రకాలువ పోల్ రాజ్ తదితర సుమారు 62 డ్రెయిన్ల ద్వారా ప్రవహిస్తూ వచ్చి సముద్రంలోకి చేరే ఏకైక మార్గం కూడా కొల్లేరే. ఆసియా ఖండంలోనే అతిపెద్ద మంచినీటి సరస్సు కొల్లేరు అనేది మాటల్లోనే... నిజానికి కొల్లేరు ఆక్రమణలతో కుచించుకుపోయింది. కొల్లేరును పరిరక్షిస్తే వచ్చే ఆదాయం కంటే ఆక్రమణకు సహకరిస్తే వచ్చే ఆదాయం పైనే అధికారులు మక్కువ చూపుతారనే విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఒక్క మణుగులూరు వద్దే సుమారు 600 పైబడి ఎకరాలను ఆక్రమించి రొయ్యల చెరువులను తవ్వేశారు. ఈ చెరువుల తవ్వకాలతో మణుగూరు రెండు గ్రూపులుగా ఏర్పడింది. కొల్లేరులో చెరువులు తవ్వాలని ఒక గ్రూపు, తవ్వొద్దంటూ మరో గ్రూపు తగాదాలకు తిరిగి కేసులు పెట్టుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. అయితే 2013లో మణుగులూరు వద్ద అదే ప్రాంతంలో కొల్లేరు ఆక్రమణలను అడ్డుకున్న అధికారులు ఎన్ని కోట్లకు అమ్ముడుపోయారో కాని 2023లో గత ప్రభుత్వ తవ్వకాలు చేపట్టిన చెరువుల తవ్వకాలను ఏ ఒక్క అధికారి అడ్డుకోవడానికి కాదు కదా కన్నెత్తి చూడడానికి కూడా సాహసించలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో చటాకాయ, పందిరిపల్లిగూడెం, కోమటిలంక, పైడి చింతపాడు, చెట్నిపాడు, చింతపాడు, మణుగులూరు, పెనుమాకలంక, ఆకివీడు, సిద్దాపురం, యాగనిమిల్లి, గుడివాకలంక తదితర గ్రామాల్లో 2500 ఎకరాల నుంచి మూడు వేల ఎకరాల వరకు కొల్లేరును ఆక్రమించి రొయ్యల చెరువులు తవ్వినట్లు సమాచారం. 2006 కొల్లేరు ఆపరేషన్ పేరుతో ధ్వంసం చేసిన చెరువులను తిరిగి 70 శాతం ఆక్రమించి రొయ్యల సాగు చేస్తున్నట్లు వినికిడి. ఈ ఆక్రమణలు వరద ప్రవాహానికి అడ్డుపడడంతో కొల్లేరు వరద ఎగదన్ని గ్రామాలను చుట్టుముట్టడంతో గ్రామాలు జలదిగ్బంధనంలో చిక్కుకుపోయి రాకపోకలు స్తంభించిపోయి లంక గ్రామాలు విలవిలలాడుతున్నాయి. దీనికి తోడు పెద్ద అట్లగాడి వంతెన వద్ద మేటవేసిన గుర్రపు డెక్క తూడును తొలగించకపోవడం, జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా ఉప్పుటేరుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణానికి నీరు రాకుండా కాంట్రాక్టర్ మట్టి దిబ్బలను అడ్డువేయడం, ఉప్పుటేరులో పెరిగిన ఆక్రమణలతో పాటు దట్టంగా పెరిగిన తూడు అధికారులు తొలగించకపోవడం ఉప్పుటేరు పరిధి పెంచాలని జస్టిస్ కృష్ణయ్య కమిషన్ ఇచ్చిన నివేదికపై రాజకీయ నాయకులతో పాటు, అధికారులు దృష్టి సారించకపోవడం వంటి కారణాల వల్లే ఇంతటి విపత్తుకు కారణమైందని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు, అధికారులు ముంపు బారి నుంచి ప్రజలను కాపాడే విధంగా స్పందించి 2006లో చేపట్టిన కొల్లేరు ఆపరేషన్‌పై దృష్టి సారించి ఆక్రమణలను తొలగిస్తారాచ ఆక్రమణలదారులకు అండగా నిలుస్తారా అనేది తెలియని ప్రశ్నగా మారింది..


రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

దీనిపై డిఎఫ్ఒ రవికుమార్‌ను వివరణ కోరగా ఆక్రమణలే కొల్లేరు ముంపునకు ప్రధాన కారణమని అందరికీ తెలిసిన విషయమేనన్నారు. అంతేకాకుండా కొల్లేరులో చేపట్టిన కార్యక్రమాలను ఏళ్ల తరబడి నిలిపివేయడం కూడా ఒక కారణమన్నారు. కొల్లేరులో నెలకొన్న పరిస్థితులపై ఉన్నతాధికారులకు పూర్తిస్థాయిలో నివేదిక అందిస్తున్నామని తెలిపారు.

నేటి నుంచి నిరసన

ప్రజాశక్తి - పోలవరం

జిఒ 85కు వ్యతిరేకంగా బుధవారం నుంచి సమ్మెలోకి దిగుతామని కోండ్రుకోట, వింజరం, ఎల్ఎన్‌డిపేట పిహెచ్‌సి వైద్యులు నిఖిల్, గిరిధర్, శ్రీరభ్య తెలిపారు. గొల్లపూడిలోని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌కు మంగళవారం అధికారిక నోటీసు అందించారు.

ఊటుకూరులో పోలీస్ పికెట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ఊటుకూరులో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ తెలిపారు. ఊటుకూరులో జరిగిన పోసిన బాలకోటయ్య హత్య నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు.

నష్టం అంచనా వేయాలి

ప్రజాశక్తి - భీమడోలు

వరద నష్టం అంచనాలను క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత నిర్ణీత ఫార్మేట్‌లో నమోదు చేయాలని భీమడోలు మండల ప్రత్యేకాధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ కోరారు. వరద నష్టం అంచనాలు తయారు చేసేందుకు, ఆ తర్వాత చేసే కార్యక్రమాలపై ఆర్‌డిఒ మండల స్థాయి అధికారులతో భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశ మందిరంలో మంగళవారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద నష్టాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం 20 అంశాలతో కూడిన ఫార్మేట్‌ను రూపొందించిందన్నారు. దీనిలో గ్రామాల వారీగా, విభాగాలు, శాఖల వారీగా వరద నష్టాన్ని అంచనాలను నమోదు చేయాలని కోరారు.

చింతలపూడి : వర్షం, వరదలకు నష్టాలను అంచనా వేసి అధికారులు నివేదిక ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ప్రమాద్వరతో కలిసి మండల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు, వరదలకు నష్టం జరిగితే సంబంధిత అధికారులు అంచనా వేసి రిపోర్ట్ ఇవ్వాలని చెప్పారు.

వినాయక లడ్డూ రూ.91,116

టి.నరసాపురం :గణేష్ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రాజుపోతేపల్లిలో నిర్వహించిన వినాయక లడ్డూ వేలం పాటలో రూ.91,116కు గ్రామానికి చెందిన దవులూరి సూర్యనారాయణ దంపతులు దక్కించుకున్నారని ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను వేలం పాట నిర్వహించగా వేలంలో గెలుచుకున్న సూర్యనారాయణ దంపతులకు లడ్డూ అందించినట్లు వారు తెలిపారు.

జాబ్‌మేళాలో 67 మంది ఎంపిక

భీమడోలు :రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం సంయుక్తంగా భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మే ళాకు పెద్దఎత్తున నిరుద్యోగ యువత హాజర య్యారని కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్ తెలిపారు. జాబ్‌మేళాకు 119 మంది హాజరు కాగా 67 మంది వివిధ కంపెనీలు నిర్వ హించిన ముఖాముఖిలో ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సుధాకర్ తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

కామవరపుకోట :రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ కోకో లైఫ్, ఆగ్రో కంపెనీల ఏలూరు ప్రతినిధుల ఆధ్వర్యంలో భద్రత పరిరక్షణ, ఆరోగ్యం, సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు భీమరాజు మాట్లాడుతూ పాఠశాలలో, బయటా ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తెలియజేస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు అర్బన్ :ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏలూరు పత్తేబాదలో నిర్వహిస్తున్న ఎఎన్ఎం నర్సింగ్ మహిళా శిక్షణ కళాశాలలో రెండేళ్ల కోర్సుకు ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన ఏ గ్రూపు వారైనా కూడా అర్హులేనని అన్నారు. సెప్టెంబర్ 30 లోగా దరఖాస్తులు అందించాలని చెప్పారు. వివరాలకు 9440877617, 9494239823 సంప్రదించాలని కోరారు.